ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

శుక్రవారం | అక్టోబరు 23, 2026 | సంపుటి : 7 | సంచిక : 120 | పేజీలు : 2



డిసెంబరులో జాతీయ స్థాయి

క్రీడా సంబురం

- జేఎన్ఎస్‌లో ఖేలో ఇండియా అథ్లెటిక్స్
- దేశవ్యాప్తంగా అథ్లెట్ల రాక
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



హనుమకొండ, ఆయుధం: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) మరో ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది. డిసెంబరులో నిర్వహించనున్న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం జేఎన్ఎస్ స్టేడియాన్ని సందర్శించి, పోటీల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియంలోని క్రీడా ప్రాంగణం, క్రీడాకారులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జాతీయ స్థాయి పోటీలకు హనుమకొండ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.

క్రీడాకారులకు మెరుగైన వసతులు

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. వసతి, పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి కొత్త ప్రశాంత్‌కు ఆదేశించారు. పోటీల సమయంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

స్టేడియంలో కొత్తగా నిర్మిస్తున్న మరుగుదొడ్లతోపాటు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, క్రీడా పోటీలు ప్రారంభమయ్యేలోపు అన్ని ఏర్పాట్లు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

సంస్కృతీ సంప్రదాయాలు

కాపాడుకోవాలి

- ఆధునిక ప్రపంచంలో మూలాలు మరవొద్దు
- కష్టకాలంలో ఒకరికొకరం అండగా నిలవాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అలయ్ బలయ్
- రాజకీయాలకతీతంగా హాజరైన నేతలు



"సాంకేతికంగా ప్రపంచం దగ్గరవుతున్నా, మన పక్కనున్న మనిషికి దూరం కాకూడదు. జీవితానికి సమాచారం ఎంత అవసరమో, ఆత్మీయ అనుబంధాలు కూడా అంతే అవసరం. కష్టకాలంలో ఒకరికొకరం అండగా నిలవడమే నిజమైన మానవత్వం. ఆధునికతను స్వీకరిస్తూ మన మూలాలను మరవకూడదు. మన భాషను ప్రేమిద్దాం.. మన సంస్కృతిని గౌరవిద్దాం.. మహిళలకు గౌరవం, యువతకు అవకాశాలు, పెద్దలకు ఆదరణ, బలహీన వర్గాలకు అండ అందిద్దాం. భిన్నత్వంలో ఏకత్వానికి భారతదేశాన్ని ప్రపంచానికి ఆదర్శంగా నిలుపుదాం. అదే అలయ్ బలయ్ అందించే సందేశం."

- వెంకయ్య నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి.

హైదరాబాద్, ఆయుధం:

భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ప్రకృతితో మమేకమై జీవనం సాగించకపోతే.. విపత్తులు తప్పవని హితవు పలికారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నేతృత్వంలో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా పలు పార్టీల నేతలు హాజరయ్యారు.

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు సహా పలువురు భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ సహా పలు పార్టీల నేతలు సైతం తరలివచ్చారు. మనుషుల మధ్య ఐక్యతను పెంపొందించే కార్యక్రమమే అలయ్ బలయ్ అని ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు చెప్పారు. సెక్యులర్ దేశంలో ఏ మతాన్నీ, ఏ పండగనూ తక్కువ చేసి చూడొద్దని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. వికసిత్ భారత్ మనందరి లక్ష్యం కావాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. అలయ్ బలయ్ అనేది కులమతాలు, రాజకీయాలు, ప్రాంతాలకు అతీతమైన వేదికని దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి పేర్కొన్నారు.



నాణ్యతా ప్రమాణాలతో పనులు

త్వరితగతిన పూర్తి చేయాలి

- ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క

ములుగు, ఆయుధం: నూతనంగా నిర్మిస్తున్న మోడల్ బస్‌స్టాండ్ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్తడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క ములుగు జిల్లా కేంద్రంలోని మోడల్ బస్‌స్టాండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఫ్లోరింగ్, నిర్మాణ పనులతో పాటు ఇతర పనుల పురోగతిని పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడంలో బస్‌స్టాండ్ కీలకమని తెలిపారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. పనుల వేగంతో పాటు నాణ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సదుపాయాలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మిగిలిన పనులను సమన్వయంతో పూర్తి చేసి, బస్‌స్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సర్వోత్తమ్ రెడ్డి గెలుపే

లక్ష్యంగా పనిచేయాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం
- కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే నాయిని, డీసీసీ చీఫ్ ఇనుగాల పిలుపు

హనుమకొండ, ఆయుధం: వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి పిలుపునిచ్చారు. వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల (గ్రాడ్యుయేట్స్) ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి భారీ మెజార్టీ గెలుపే లక్ష్యంగా వ్యూహాలను ఖరారు చేశారు. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ తొగరు జగన్ మోహన్ రెడ్డి, కో కన్వీనర్ బోడ డిన్న, గ్రంథాలయ ఛైర్మన్ ఎండి. అజీజ్ ఖాన్, పిసిసి ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భట్టి శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, తోట వెంకటేశ్వర్లు, విజయశ్రీ రజలీ, తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, వేముల శ్రీనివాస్, నెక్కొండ కిషన్, డీసీసీ మీడియా, కమ్యూనికేషన్ కమిటీ ఛైర్మన్ మార్క విజయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల కోసం, విద్యావంతుల కోసం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలను, రికార్డు స్థాయి ఉద్యోగ నియామకాల విజయాలను గ్రాడ్యుయేట్స్ లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లాలోని ప్రతి ఒక్క డివిజన్ అధ్యక్షుని పై, నాయకుడిపై, కార్యకర్తపై ఉందని అన్నారు. ఈ ఎన్నికను సవాలుగా తీసుకుని, ప్రతి డివిజన్ అధ్యక్షుడు తమ పరిధిలోని పట్టభద్రులను కలిసి ఫారమ్ 18 ద్వారా ఓటరుగా నమోదు చేపించి, ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న తిరుగులేని పట్టును మరోసారి నిరూపించి సర్వోత్తమ్ రెడ్డి ని భారీ మెజార్టీతో శాసనమండలికి పంపేందుకు శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. పట్టభద్రులను కలిసి ఫారమ్ 18 ద్వారా ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను భుజాన వేసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ అభ్యర్థి విజయానికి పక్కా వ్యూహంతో ముందుకు సాగాలని కోరారు.



ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి, ఆయుధం: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, తమ పరిధిలోని ప్రతి గ్రాడ్యుయేట్‌ను వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకునేలా కృషి చేయాలని, ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకునేలా చొరవ చూపాలని కోరారు. ఈ ప్రక్రియను బాధ్యతగా నిర్వహిస్తూ ,ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు.



ఘనంగా పండుగ సాయన్న

ముదిరాజ్ జయంతి

హనుమకొండ, ఆయుధం: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, రాష్ట్ర మేర కార్పొరేషన్ చైర్మన్ సంగు వెంకట్రాజం, ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, ముదిరాజ్ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న ముదిరాజ్ ధైర్య సాహసాలు, చేసిన సేవలను అధికారులు ముదిరాజ్ సంఘం ప్రతినిధులు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సంపూర్ణ, ఇతర అధికారులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు దేవేందర్ ముదిరాజ్, పొన్నం రాజ్, పులి రజనీకాంత్, పొన్నం మొగిలి, బండి సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.



మానవత్వానికి మరో రూపం

2 లో

రెడ్ క్రాస్ సొసైటీ

- జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాల ఏర్పాటుకు చర్యలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా తొలి మేనేజింగ్ కమిటీ సమావేశం

మానవత్వానికి మరో రూపం ఇండియన్ రెడ్ క్రాస్ అని.. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీగా సేవా దృక్పథంతో పనిచేయాలని వరంగల్ కలెక్టర్ డా.సత్య శారద సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా తొలి మేనేజింగ్ కమిటీ సమావేశాన్ని గురువారం జిల్లా కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జరిగింది.

ప్రణాళికతో జనగణనను సక్సెస్ చేయాలి

- అధికారులు బాధ్యతంగా వ్యవహరించాలి
- జిల్లా కలెక్టర్ & ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ చాహత్ బాజ్‌పాయ్



వరంగల్, ఆయుధం: జనగణన-2027లో భాగంగా చేపట్టనున్న జనాభా గణనను ఖచ్చితత్వంతో, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ & ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో హన్మకొండ జిల్లా, జీడబ్ల్యూ ఎంసీ లోని జిల్లా స్థాయి అధికారులు, ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులకు ఈ నెల 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన మొదటి దశలో హౌస్ లిస్టింగ్, హౌస్ బ్లాకింగ్, సంబంధిత డేటా ఎంట్రీ ప్రక్రియలు పూర్తయ్యాయని తెలిపారు. తదుపరి కీలకమైన జనాభా గణన దశను దృష్టిలో ఉంచుకుని ఎన్యూమరేషన్ బ్లాక్‌లను సమీక్షించి, అవసరమైన సవరణలను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్య, సిబ్బంది పనిభారాన్ని అంచనా వేసి సమానంగా విధులు కేటాయించాలన్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల ఎంపికలో చురుకుదనానికి ప్రాధాన్యమిస్తూ, అర్హులైన యువత, ఉపాధ్యాయులు, అందుబాటులో ఉన్న ఇతర సిబ్బందిని నిబంధనల ప్రకారం వినియోగించుకోవాలని తెలిపారు. విద్యాసంస్థల బోధనకు ఆటంకం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఛార్జ్ అధికారులు టెక్నికల్ అసిస్టెంట్లు, ఛార్జ్ క్లర్కులపైనే పూర్తిగా ఆధారపడకుండా, వారి పనితీరును స్వయంగా పర్యవేక్షిస్తూ తప్పులు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. శిక్షణలో సందేహాలను నివృత్తి చేసుకుని, చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ శిక్షణ శిబిరంలో హైదరాబాద్ జనగణన విభాగ శిక్షకులు సతీష్, ప్రశాంత్ జన గణనకు సంబంధించిన విధి విధానాలను గురించి వివరించి సందేశాలను నివృత్తి చేశారు. జనగణనతో పాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా అధికారులు పూర్తి బాధ్యతతో, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న, జెడ్పి సీఈఓ శేషాద్రి, సీపీఓ సత్యనారాయణ రెడ్డి, అదనపు కమిషనర్ జోనా, సీపీ రవీందర్ రాడెకర్, జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీఓ వెంకటేష్, ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులు తదితరుల పాల్గొన్నారు.



దుర్గామాత నవరాత్రుల ముగింపు వేడుకలు

■ అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి: మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్

వరంగల్, ఆయుధం: ఖిలా వరంగల్ తూర్పు కోట పోచమ్మ దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణంలో ఏర్పాటుచేసిన దుర్గా మాత నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించి బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ దంపతులను ఉత్సవ కమిటీ వారు సన్మానించి ఉత్సవాలకు సహకరించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ వారు కోయ గిరిజనులతో దింసా డాన్సులు, దప్పు చప్పుళ్ళు, సౌండ్ సిస్టం మొదలగు వాటితో మహిళలు పెద్ద మొత్తంలో పాల్గొని ముగింపు వేడుకలు నిర్వహించారు. సందర్భంగా ముగింపు వేడుకలను ఉద్దేశించి మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో అమ్మవారి నవరాత్రి వేడుకలు నిర్వహించారని, ఆ అమ్మవారి ఆశీస్సులతో ఖిలా వరంగల్ తూర్పు కోట ప్రజలందరూ సంతోషంగా ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని ఆ అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రెండు ఉత్సవ కమిటీలకు సంబంధించిన యూత్ సభ్యులు మహిళలు, మాల ధారణ పొందిన భవాని లు తదితరులు పాల్గొని అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



25న పద్మశాలి ప్రతిభా పురస్కార్ ప్రదానోత్సవం

వరంగల్, ఆయుధం: ఉమ్మడి వరంగల్ జిల్లా పద్మశాలి ప్రతిభా పురస్కారాలను ఈనెల 25న శివనగర్ పద్మశాలి కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుండి అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు పోపా జిల్లా అధ్యక్షులు గుండు కామేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ పురస్కార్ అవార్డు గోడపత్రికలను, హనుమకొండ పోపా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మశాలి సంఘ జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి, రాష్ట్ర అధ్యక్షులు కమ్మర్త మురళి, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్, కుడా చైర్మన్ గుండు సుధారాణి, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొంటారు.

ఆన్‌లైన్ పెట్టుబడులపై ప్రజలు

అప్రమత్తంగా ఉండాలి

■ వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్



హనుమకొండ, ఆయుధం: ప్రజలు ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ సూచించారు. QVSE (Quantum Vest Stock Exchange) యాప్ ద్వారా పెద్ద ఎత్తున ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు జరుగుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర సైబర్ క్రైమ్ విభాగాలు హెచ్చరించాయని తెలిపారు. ఈ మోసంలో భాగంగా సైబర్ నేరగాళ్లు బాధితులను QVSE యాప్ APK ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలని ప్రేరేపిస్తున్నారు. అనంతరం భారతీయ రూపాయలను Binance ఎక్స్ఛేంజ్ ద్వారా క్రిప్టోకరెన్సీగా మార్చి పెట్టుబడి పెట్టాలని సూచిస్తున్నారు. కనీసం 500 USDT (సుమారు రూ.54,000) పెట్టుబడి పెడితే 1 శాతం లాభం వస్తుందని ఆశ చూపుతున్నారు. అంతేకాకుండా, ఇతరులను యాప్‌లో చేర్పిస్తే మొదటి స్థాయి రిఫరల్‌కు 50 USDT, రెండో స్థాయి రిఫరల్‌కు 25 USDT ఇస్తామని నమ్మిస్తున్నారు. ఈ తరహా మోసాలకు సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 56 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి:

- అధిక లాభాలు, తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్పే ఆన్‌లైన్ పెట్టుబడి పథకాలను నమ్మవద్దు.
- తెలియని వ్యక్తులు పంపే APK ఫైళ్లను, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు.
- ధృవీకరించని యాప్‌లు, ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో డబ్బు పెట్టుబడి పెట్టవద్దు.
- క్రిప్టోకరెన్సీ రూపంలో డబ్బు బదిలీ చేయాలని కోరితే అప్రమత్తంగా ఉండండి.
- మీ OTPలు, బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దు.
- ఇతరులను రిఫర్ చేస్తే అదనపు ఆదాయం వస్తుందని చెప్పే పథకాల పట్ల జాగ్రత్తగా ఉండండి.
- అత్యాశకు పోయి కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోవద్దు. అప్రమత్తతే సైబర్ మోసాల నుంచి రక్షణ.
- ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి. త్వరగా ఫిర్యాదు చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చు.

భూదాన్ భూముల వివరాలు

అప్ డేట్ చేయాలి

■ అదనపు కలెక్టర్ ఎన్. రవి

హనుమకొండ, ఆయుధం: భూదాన్ భూముల వివరాలను భూభారతి పోర్టల్ లో (అప్డేట్) నవీకరణను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్షరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో రెవెన్యూ సంబంధిత అంశాలు, భూ రీసర్వే పై ఆర్డీవోలు, భూములు కొలతలు శాఖ అధికారులు, తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ జిల్లాలో జీవో 59, అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూముల క్రమబద్ధీకరణల పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. భూములకు సంబంధించి పెండింగ్ కోర్టు కేసులను త్వరగా పూర్తి చేయాలి అన్నారు. పెండింగ్ లో ఉన్న భూభారతి దరఖాస్తుల త్వరితగతిన పరిష్కారానికి తహసీల్దార్లు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్లు తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, భూములు కొలతలు శాఖ ఏడి నూర్ సింగ్, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మానవత్వానికి మరో రూపం రెడ్ క్రాస్ సొసైటీ

- జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా తొలి మేనేజింగ్ కమిటీ సమావేశం



వరంగల్, ఆయుధం: మానవత్వానికి మరో రూపం ఇండియన్ రెడ్ క్రాస్ అని.. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీగా సేవా దృక్పథంతో పనిచేయాలని వరంగల్ కలెక్టర్ డా.సత్య శారద సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా తొలి మేనేజింగ్ కమిటీ (MC) సమావేశాన్ని గురువారం జిల్లా కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించనైనది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని వారు పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రపంచ వ్యాప్తంగా మానవతా విలువలకు, స్వచ్ఛంద సేవలకు ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. ప్రతి పౌరుడు రెడ్‌క్రాస్ సభ్యత్వం తీసుకొని సమాజ సేవలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. మహిళా, శిశు సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ శాఖల సహకారంతో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.
*వయోవృద్ధుల సంక్షేమానికి 'ప్రణామ్' కార్యక్రమం
వయోవృద్ధుల కోసం 'ప్రణామ్' కార్యక్రమం ద్వారా ఆహ్లాదకరమైన కార్యక్రమాలు నిర్వహించి, వారిలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతోపాటు సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా రక్తదాన శిబిరాలను విస్తృతంగా నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలల్లో జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు *నషా ముక్త్ భారత్ - మాదకద్రవ్య రహిత వరంగల్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతకు ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని నీటి పొదుపు, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరంలో ఉన్న పేదలు, నిరుపేదలు, బాధితులకు రెడ్‌క్రాస్ సభ్యులందరూ సమన్వయంతో సేవలందించాలని పిలుపునిచ్చారు.
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వరంగల్ బేతి అశోక్ బాబు మాట్లాడుతూ... వరంగల్‌లో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ భవన సముదాయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయానికి స్థలం కేటాయించాలని, ఎంజీఎం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితోపాటు నర్సంపేట, వర్ధన్నపేట ప్రాంతాల్లో జనరిక్ మెడికల్ స్టోర్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసి, అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను కోరగా అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో మేనేజ్‌మెంట్ కమిటీ నిర్ణయం మేరకు ఇ.వి. శ్రీనివాసరావును ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా సలహాదారుగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వరంగల్ జిల్లా చైర్మన్‌గా ఎంపికైన బేతి అశోక్ బాబు, మేనేజింగ్ కమిటీ పరిచయం చేశారు. హనుమకొండ రెడ్ క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యులు, జిల్లా గౌరవ సలహాదారు ఇ.వి.శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ శానబోయిన రాజ్‌కుమార్, రాష్ట్ర పాలక మండలి సభ్యులు నాదెం శాంతికుమార్, కోశాధికారి బొల్లం శివ, జిల్లా పాలక మండలి సభ్యులు మండల పరశురాములు, తోట సంపత్ కుమార్, చొప్పరి సోమయ్య, కుసుమ సత్యనారాయణ, మామిడాల రమేష్ బాబు, మోతె తిరుపతిరెడ్డి, డా. గజవెల్లి రాజ్‌కుమార్, ముల్క ప్రసాద్, వడ్డె రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్, సుమన్, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వసంత, సహాయ కార్మిక శాఖ అధికారి భార్గవ్‌తోపాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.
ప్రజల ఆరోగ్యం, రక్తదానం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సామాజిక సంక్షేమం వంటి రంగాల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వ శాఖలు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలి

- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి
- పాత భూభారతి దరఖాస్తులకు నవంబర్ 15 గడువు
- కొత్త దరఖాస్తులను 30 రోజుల్లోగా పరిష్కరించాలి
- భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్



ములుగు, ఆయుధం: భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి పక్కా ప్రణాళిక రూపొందించి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ జిల్లా అదనపు కలెక్టర్లను ఆదేశించారు. గురువారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూముల రీ సర్వే, బృందాల ఏర్పాటు, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, హైకోర్టు కేసులు, భూసేకరణ, ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 కింద క్రమబద్ధీకరణ దరఖాస్తులు, భూదాన్ భూములపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ నీహెచ్ మహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ కుమార్ మాట్లాడుతూ పాత భూభారతి విధానంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నవంబర్ 15లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. కొత్త భూభారతి విధానంలో అందే దరఖాస్తులను స్వీకరించిన తేదీ నుంచి 30 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ నిర్దిష్ట గడువులను పాటించాలని సూచించారు. రీ సర్వే పురోగతి, ఇందుకు అవసరమైన బృందాల ఏర్పాటుపై సమీక్షించారు. రీ సర్వే పనులు సక్రమంగా సాగేందుకు బృందాల ఏర్పాటుపై దృష్టి సారించాలని తెలిపారు. భూదాన్ భూములు, భూ సేకరణ అంశాలు, హైకోర్టు కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, డిప్యూటీ తహసీల్దార్ నితీష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపక్షం వార్షికోత్సవం

- హాజరైన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



హనుమకొండ, ఆయుధం: ప్రజాపక్షం దినపత్రిక 8వ వార్షికోత్సవాన్ని హనుమకొండలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాపక్షం పత్రిక ప్రజాస్వామ్య వాదుల గొంతుకగా నిలిచిందని, సమాజంలో వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తుల కరదీపికగా ముందుకు సాగుతున్నదని అన్నారు. ప్రజాసమస్యలే ఎజెండాగా రాజ్యాంగ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా వార్తలను అందిస్తూ ముందడుగు వేస్తున్న దినపత్రిక ప్రజాపక్షం అన్నారు. సమాజంలోని పేద, కార్మిక, రైతు, మహిళల, విద్యార్థి యువజన, ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్నదని అన్నారు. పక్షపాతం లేకుండా ప్రజాహితమే పరమావధిగా వార్తలను నిజాయితీతో వార్తలను ప్రచురించడంలో ప్రజాపక్షం ప్రజాపక్షం దినపత్రిక ముందుకు సాగాలన్నారు. దిన దినాభివృద్ధి చెంది మరింతగా ప్రజల మన్ననలు చూరగొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కరె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి తోట సుధాకర్, సిపిఐ జిల్లా నాయకులు ఏదునూరి వెంకట్రాజం, ఎన్‌వీ స్టాలిన్, మాలోతు శంకర్, నవచేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, గుంటి రాజేందర్, ప్రజాపక్షం విలేఖరులు ఎండి.ఉస్మాన్ పాషా, ముదిగిరి ఓదెలు, పి.కిషోర్, కుక్కల రాజు, ఎర్ర కుమారస్వామి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు ప్రాధాన్యత

- విధి నిర్వహణలో తప్పనిసరిగా రక్షణ పరికరాలు వినియోగించాలి
- కార్మికులకు రక్షణ పరికరాలు పంపిణీ
- జిడబ్ల్యూఎంసీ స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కమిషనర్ టి.వెంకన్న



వరంగల్, ఆయుధం: పారిశుద్ధ్య కార్మికుల భద్రతే అత్యంత ప్రాధాన్యత అని జిడబ్ల్యూఎంసీ స్పెషల్ ఆఫీసర్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. గురువారం జిడబ్ల్యూ ఎంసీ ప్రధాన కార్యాలయంలో కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, కమిషనర్ టి.వెంకన్నతో కలసి పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫార్మ్స్, యాప్రాన్లు, బూట్లు, గ్లౌజులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించే సమయంలో తప్పనిసరిగా యూనిఫార్మ్‌తో పాటు అప్రాన్ ధరించాలని, బూట్లు, గ్లౌజులు ఉపయోగించాలని సూచించారు. కార్మికుల ఆరోగ్యం, వ్యక్తిగత భద్రతను కాపాడటంలో రక్షణ పరికరాలు కీలకమని పేర్కొంటూ, వాటిని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వినియోగించాలని తెలిపారు. కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ... విధి నిర్వహణలో ప్రతి కార్మికుడు తప్పనిసరిగా యూనిఫార్మ్‌తో పాటు రక్షణ పరికరాలను ధరించి, తమ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్వైజర్లు గోల్కొండ శ్రీను, భాస్కర్, శ్యామ్ రాజ్, అనిల్ కుమార్, భాస్కర్ సానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా దుర్గామాత నిమజ్జనం

వరంగల్, ఆయుధం: శ్రీకనక దుర్గా దేవాలయంలో అమ్మవారి నవ రాత్రుల్లో విశేషంగా పూజలు అందుకున్న అమ్మవారి ఉత్సవ మూర్తిని ఘనంగా నిమజ్జనం చేశారు. దేవాలయ ఆలయ అధ్యక్షులు వరంగల్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ మీసాల ప్రకాష్ అమ్మవారి శోభ యాత్ర నిర్వహించి, నిమజ్జన కార్యక్రమం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ శ్రీ కనకదుర్గ దేవాలయం నుండి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి కట్ట మల్లన్న చెరువులో నిమజ్జనం చేశామని తెలిపారు. అమ్మవారి కృప కటాక్షాలు అందరికీ ఉండాలని ఆయన కోరుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



పండుగ సాయన్న జయంతి

మహబూబాబాద్, ఆయుధం: తెలంగాణ రాబిన్ హుడ్, ప్రజా వీరుడు ముదిరాజ్ ముద్దు బిడ్డ పండుగ సాయన్న ముదిరాజ్ 174 వ జయంతి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో కార్యక్రమం నిర్వహించారు. పండుగ సాయన్న ముదిరాజ్ చిత్ర పటానికి ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు, జిల్లా అడిషనల్ కలెక్టర్, బీసీ వెల్ఫేర్ అధికారి సాయి శ్రీజ, మహబూబాబాద్ పట్టణ మున్సిపల్ చైర్మన్ జ్యోతి రమేష్, ఏఎఫ్‌వో శ్రీనివాస్, ముదిరాజ్ జిల్లా అధ్యక్షులు చిల్ల సహదేవ్, చిప్ ప్రమోటర్ కొత్తూరు రమేష్, ముదిరాజ్ రాష్ట్ర నాయకులు గొడుగు శ్రీనివాస్, గడ్డం నాగార్జున ముదిరాజ్, రామ్ భద్రయ్య తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఒంటి కాలిపై నిల్చొని నిరసన



వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సెంటర్ లో ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు నిరవధిక సమ్మె గురువారం 10 వ రోజుకు చేరుకుంది. వెంటనే రెగ్యులరైజ్ చేయాలనీ నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ఉద్యోగులను ఉన్న ఫళంగా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులంతా ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమాదవ శాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఇవ్వాలన్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఎన్ హెచ్ ఎం లో పని చేస్తున్న 78 క్యాడర్ల ఎంప్లాయిస్ ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజేషన్ చేయాలని 20 సంవత్సరాల నుంచి ఎన్ హెచ్ ఎం లో పనిచేస్తున్న వారి సేవలను గుర్తించి ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు సేవలో ప్రథమ స్థానం నిలుస్తున్నారు ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీనియర్ బి.ఆర్.ఎస్ నాయకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నేషనల్ మెడికల్ అసోసియేషన్ (ఎన్.ఎం.ఏ) మాజీ అధ్యక్షులు డాక్టర్ పులి సురేష్ పాల్గొని మాట్లాడారు. తమ న్యాయమైన డిమాండ్లు ను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో రిలే నిరాహార దీక్ష చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహన్ రావు, తెలంగాణ ఆర్.బి.ఎస్ కే. ప్రెసిడెంట్ డాక్టర్ జి రవీందర్, డైక్ మేనేజర్ మేర్గు అనిల్ కుమార్, డాక్టర్ కిరణ్, డాక్టర్ హరికృష్ణ ,డాక్టర్ సదానందం, అకౌంటెంట్స్ శ్రీనివాస్ బాబు, శ్వేత, ప్రేమలత, నర్సింగ్ ఆఫీసర్స్ కళ్యాణి, మంజుల, సుమలత, ఫార్మసీ ఆఫీసర్ జోష్ణ, నూకల అంజి యాదవ్, సంతోష్ ,తీగల సతీష్ కుమార్, శివకుమార్ టీ.బి.డిపార్ట్మెంట్ రంజిత్ , రాకేష్, ఏ.ఎన్.ఎం.లు శ్రీలత, ఫెనీన, ప్రభావతి, ఉమా, నర్మద ,ఎం.ఎన్.ఓ. బండి రాజేష్, దాడి మాధవరావు, అజ్మీర్ విజయ నాయక్, కలవల్ల కుమార్ మరియు సపోర్టింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695